
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

మంగళవారం ၊ 23 ၊ సెప్టెంబర్ ၊ 2025

I



28,350 క్యూసెక్కుల వరద

సోమశిల: జలాశయానికి 28,350 క్యూసెక్కుల వరద వస్తోంది. పెన్నానదికి 17,250, ఉత్తరకాలువకు 280, కావలి కాలువకు 400, కండలేరుకు 10,450 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,15,500
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.10,410
3 శాతం జీఎస్టీతో	రూ.10,722
నవర (8 గ్రా)	రూ.85,776

గరిష్టం/కనిష్టం
33.8 /28.2

వాతావరణం

జిల్లాలో మంగళవారం వాతావరణం పొడిగా ఉంటుంది. అక్కడక్కడ ఆకాశం పాక్షికంగా మేఘావృతంగా ఉంటుంది. సోమవారం గాలిలో తేమ 60 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

జేసీగా వెంకటేశ్వర్లు బాధ్యతల స్వీకరణ



కుటుంబ సభ్యుల సమక్షంలో బాధ్యతలు స్వీకరించిన జాయింట్ కలెక్టర్

నెల్లూరురూరల్: జాయింట్ కలెక్టర్‌గా మొగిలి వెంకటేశ్వర్లు కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కుటుంబ సభ్యులు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్యతలను ముందుకు తీసుకెళ్లేందుకు, అందుకు అనుగుణంగా పని చేస్తానని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఏ సమస్య అయినా తనను ప్రజలు నేరుగా వచ్చి కలుసుకోవచ్చు అన్నారు.

కోర్టు విధులను బహిష్కరించిన న్యాయవాదులు

నెల్లూరు (లీగల్): ఏపీ హైకోర్టు జారీ చేసిన సర్క్యులర్ నంబర్ 10/2025కు నిరసనగా నెల్లూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు సోమవారం కోర్టు విధులను బహిష్కరించారు. ఈ సర్క్యులర్‌ను ఉపసంహరించుకోవాలని న్యాయవాదులు కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు అయ్యపరెడ్డి, జల్లి పద్మాకర్, ప్రధాన కార్యదర్శి నాగరాజుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు విద్యార్థినుల అదృశ్యం

నెల్లూరు (క్రైమ్): వేర్వేరు కళాశాలల్లో చదువుతున్న ఇద్దరు విద్యార్థినులు అదృశ్యమైన ఘటనలపై సోమవారం చిన్నబజారు పోలీసులు కేసులు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. కలువాయికి చెందిన ఓ బాలిక నెల్లూరు నగరంలోని రావూస్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతూ కాలేజీ హాస్టల్‌లో ఉంటోంది. ఈ నెల 21వ తేదీ హాస్టల్ నుంచి బయటకు వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. ఈ విషయం తెలుసుకున్న బాధిత తల్లి హుటాహుటిన నెల్లూరుకు చేరుకుని కుమార్తె అదృశ్యంపై చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కుటుంబ సభ్యుల పేరిట ఫోన్ వచ్చాక..

బుచ్చిరెడ్డిపాళెం మండలానికి చెందిన ఓ యువతి నెల్లూరు నగరంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతూ కళాశాల హాస్టల్‌లో ఉంటోంది. ఈ నెల 20వ తేదీన హాస్టల్ వార్డెన్‌కు విద్యార్థిని కుటుంబ సభ్యుల పేరిట ఫోన్ వచ్చింది. విద్యార్థినిని ఇంటికి పంపాలని కోరారు. దీంతో విద్యార్థిని హాస్టల్ నుంచి బయటకు వెళ్లింది. కుమార్తెతో మాట్లాడేందుకు తల్లిదండ్రులు హాస్టల్‌కు ఫోన్ చేయగా వార్డెన్ జరిగిన విషయాన్ని చెప్పాడు. తాము ఫోన్ చేయలేదని బాధిత తల్లిదండ్రులు హాస్టల్ వార్డెన్‌కు చెప్పారు. కుమార్తె అదృశ్యంపై బాధిత తండ్రి సోమవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

డీకేడబ్ల్యూలో జాబ్‌మేళా నేడు

నెల్లూరు (పొగతోట): నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు మంగళవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు డీకే ప్రభుత్వ డిగ్రీ కాలేజ్‌లో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి అబ్దుల్ ఖయ్యూం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళాలో 15 పరిశ్రమలు ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగావకాశాలు కల్పించేలా చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. జిల్లాలో 10వ తరగతి, ఐటీఐ, డిప్లొమా, ఇంటర్, డిగ్రీ చదివిన నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.



➡ ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు కర్లపూడి హరిప్రసాద్. టీపీగూడూరు మండలం పెద్ద చెరుకూరు. ఆయన సైదాపురం మండలం మొలకలపూడి సర్వే నంబర్ 500/2బీలో 17.11 ఎకరాల భూమిని పోలిశెట్టి శ్రీనివాసులు నుంచి 2023 జూన్‌లో కొనుగోలు చేసి డాక్యుమెంట్ నంబర్ 3915/23 ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. ఈసీ, పొజిషన్‌లో సైతం హరిప్రసాద్ ఉన్నారు. అయితే 2024 ఎన్నికల సమయంలో అక్కడి వీఆర్వో హజరత్తయ్య, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ స్థానికులతో కుమ్మక్కై ఎలాంటి డాక్యుమెంట్లు లేకుండానే 6 ఎకరాల భూమిని నక్కిన బోయిన వెంకటేశ్వర్లు, వరికూటి శంకరయ్య, మల్లారపు చినపెంచలయ్య పేరుతో ఒక్కొక్కరికి 2 ఎకరాల చొప్పున ఆన్‌లైన్ అడంగల్‌లో ఎక్కించారు. దీంతో పట్టాభూమి యజమాని తహసీల్దార్ చుట్టూ కనీసం 10 సార్లు తిరిగాడు. ఆర్డీఓకు ఆర్ఓఆర్ కింద ఫిర్యాదు చేశారు. కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో ఇప్పటికి 3 దఫాలుగా కలెక్టర్‌కు అర్జీలిచ్చారు. అయితే విచారణకు కూడా పిలవలేదు. నోటీసు ఇవ్వలేదు. కానీ అర్జీ సమస్య పరిష్కరించినట్లు ఆన్‌లైన్‌లో చూపిస్తున్నారు. ఈ క్రమంలో ఆయన కలెక్టరేట్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ అధికారులను వేడుకుంటూనే ఉన్నాడు.



➡ ఈ చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పేరు నరిగె యర్రయ్య. సుమారు 77 ఏళ్లు. చేజర్ల మండలం ఉలవపల్లి. ఆయనకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. వీరిలో ఒక కుమార్తె, కుమారుడు మృతి చెందారు. యర్రయ్య తండ్రి 1987లో కలువాయి మండలం తెలుగురాయపురంలో 1.42 ఎకరాలు భూమి కొనుగోలు చేశాడు. అయితే ఈ పొలాన్ని యర్రయ్య చేస్తున్నాడు. అయితే పక్కనున్న పొలం వారు తమకు దారి కావాలంటూ ఆయన్ను పొలం చేయనీయడం లేదు. ఈలోపు రెవెన్యూ అధికారులు అడంగల్‌లో కూడా 1.42 ఎకరాలకు బదులు ఎకరాకు మార్చేశారు. తనను పొలం చేసుకునేలా చేయాలని యర్రయ్య కలువాయి తహసీల్దార్‌కు పది దఫాలుగా అర్జీలు ఇచ్చాడు. న్యాయం జరగలేదు. కలెక్టరేట్‌కు ఇప్పటికి మూడు దఫాలుగా వచ్చి పీజీఆర్ఎస్‌లో అర్జీలు ఇచ్చాడు. కలెక్టరేట్ అధికారులు ఆ అర్జీలను మళ్లీ కలువాయి తహసీల్దార్‌కు పంపిస్తున్నారు. అయితే సమస్య పరిష్కరించినట్లు రికార్డుల్లో చూపుతున్నారు. సమస్య మాత్రం అలాగే ఉంది.

తిరస్కారమే.. పరిష్కారం

▸▸ పీజీఆర్ఎస్ అర్జీలకు జవాబుదారీతనం ఏదీ?

- గంపెడంత ఆశతో వారం.. వారం కలెక్టరేట్ చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్న బాధితులు
- 15 నెలల కూటమి పాలనలో ఒక్క కలెక్టరేట్‌కే 50 వేలకు పైగా అర్జీలు
- మండల అధికారులకు పంపుతారు.. పరిష్కరించినట్లు ఆన్‌లైన్‌లో చూపుతారు
- కానీ అవి పరిష్కారం కాలేదంటూ మళ్లీ మళ్లీ వస్తున్న బాధితులు

కలెక్టరేట్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక.. ప్రహసనంగా తయారైంది. ఒకే సమస్యపై అదే బాధితులు పదేపదే ఇస్తున్న అర్జీలే ఇందుకు దర్పణంగా నిలుస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మండల స్థాయి ప్రభుత్వ కార్యాలయాల్లో అధికార పార్టీ నేతల పెత్తనం మితిమీరింది. టీడీపీ నేతలు అధికారులను గుప్పెట్లో పెట్టుకుని సామాన్యుల ఆస్తుల కబ్జాకు పాల్పడుతున్నారు. ప్రధానంగా అధికార పార్టీ నేతల ఒత్తిడితో, స్వలాభాల కోసం రెవెన్యూ అధికారులు 'ఆన్‌లైన్ రెవెన్యూ రికార్డు వ్యవస్థ'ను ఇష్టారీతిన తారుమారు చేస్తున్నారు. ఆయా సమస్యలను పరిష్కరించుకునేందుకు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకపోవడంతో గంపెడంత ఆశతో కలెక్టరేట్‌కు వచ్చి అర్జీలిస్తే.. తిరిగి స్థానిక అధికారుల వద్దకే వెళ్లోంది. పీజీఆర్ఎస్ అర్జీలకు జవాబుదారీతనం లేకపోవడంతో స్థానిక అధికారులు పరిష్కరించినట్లు ఆన్‌లైన్‌లో చూపుతున్నారు. కానీ ఆ సమస్యలు పరిష్కారం కాలేదంటూ బాధితులు మళ్లీ మళ్లీ వస్తున్నారు.

నెల్లూరు (అర్బన్): జిల్లా పరిపాలనకు కలెక్టర్ కార్యాలయం కేంద్ర బిందువు. అన్ని ప్రభుత్వ శాఖలకు ప్రధాన పాలనాధికారి కలెక్టర్ మాత్రమే. ప్రధానంగా ప్రజల ఆస్తుల హక్కులు కల్పించే, అర్హతల పత్రాలు జారీ చేసే రెవెన్యూ శాఖ అత్యంత కీలకమైంది. ఈ శాఖాధికారులు తప్పిదాలు, నిర్లక్ష్యం కారణాలతో తమ పొలం ఆక్రమించారనో.. అడంగల్‌లో పేర్లు మార్చేసేశారనో.. పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వడం లేదనో.. ఇంటి పన్ను వేరొకరి పేరు మీద మార్చేసేందుకు క్షేత్రస్థాయి సిబ్బంది సహకరించారనో.. పొలానికి దారి లేకుండా చేశారనో.. రీసర్వేలో తప్పులు జరిగాయనో.. ఇలా పలు సమస్యలపై బాధితులు మండల స్థాయిలో తహసీల్దార్, ఎంపీడీఓ తదితర అధికారులకు అర్జీలు ఇచ్చి వారి చుట్టూ తిరుగుతున్నారు. అయినా అక్కడ పరిష్కారం లభించకపోవడంతో ఎంతో ఆశతో మారుమూల పల్లెల నుంచి వ్యయ ప్రయాసాలకోర్చి బాధితులు కలెక్టరేట్‌కు చేరుకుని అర్జీలు ఇచ్చి పరిష్కారమవుతాయని ఆశగా ఎదురు చూస్తున్నారు. వీటిని పరిష్కరించకుండా మళ్లీ మండల స్థాయి అధికారుల వద్దకు అర్జీలను కలెక్టరేట్ అధికారులు పంపి పరిష్కరించినట్లు రికార్డుల్లో చూపుతున్నారు. అక్కడ సమస్యలు పరిష్కారం కాక మళ్లీ మళ్లీ కలెక్టరేట్ చుట్టూ బాధితులు కాళ్లరిగేలా తిరుగుతున్నా ప్రయోజనం కనిపించడం లేదు.

తప్పు అధికారులది.. శిక్ష ప్రజలకు

గ్రామాల్లో గతంలో జరిగిన రీసర్వేలో వీఆర్వోలు, సర్వేయర్లు అనేక తప్పులు చేశారు. కొన్ని భూముల సర్వే నంబర్లు సైతం ఇష్టారీతిన మార్చేశారు. కొన్ని భూములను నిషేధిత భూముల జాబితాలో చేర్చేశారు. రైతులకు తెలియకుండానే వారి భూములను రెగ్యులర్ ఖాతాల నుంచి నోషనల్ ఖాతాల్లోకి మార్చడం వంటి తప్పిదాలకు పాల్పడ్డారు. అధికారులు చేసిన తప్పులను సరి చేయాలని సంవత్సరాల తరబడి గ్రీవెన్స్‌లో అధికారులకు బాధితులు అర్జీలు ఇస్తూ తిరుగుతున్నా కనికరం చూపడం లేదు.



కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌లో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, జేసీ వెంకటేశ్వర్లు

➡ నెల్లూరు రూరల్ మండలం అల్లీపురం గ్రామానికి చెందిన కె.సుబ్బారావుకు సర్వే నంబర్ 269బీలో 2 ఎకరాలకు పైగా పక్కా పట్టా భూమి ఉంది. అయితే ఆయనకు తెలియకుండానే సర్వేయర్ ఆ భూమిని నోషనల్ ఖాతాలో చేర్చారు. రెవెన్యూ అధికారులు చేసిన తప్పునకు ఆయన కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నారు. సుమారు 7 నెలలుగా కలెక్టరేట్ అధికారుల వద్ద ఆ ఫైల్ పెండింగ్‌లో ఉంది.

➡ ఆమంచర్లలోని సర్వే నంబర్ 556/1, 550/1లోని నజీర్‌బాషాకు చెందిన 1.60 ఎకరాలను 2017లో ఎస్ఎంఎస్ పార్కు కోసం ప్రభుత్వం తీసుకుంది. నష్టపరిహారం చెల్లించగా ఇంకా రూ.2.10 లక్షలు బ్యాలెన్స్ చెల్లించాల్సి ఉంది. పెండింగ్ నగదును ఇప్పించాలని ఆర్డీఓకి ఆరుసార్లు, కలెక్టరేట్‌లో 3 సార్లు అర్జీలు ఇచ్చినా అతీగతి లేదు.

➡ పొదలకూరులో నివాసం ఉంటున్న ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ తన భార్య పేరు మీద గండవరంలో ఒకరి నుంచి ఇల్లు కొనుగోలు చేశాడు. గత సంవత్సరం వరకు పట్టా, ఈసీ, ఇంటి పన్ను రసీదులు ఉన్నాయి. అయినప్పటికీ ఇటీవల ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌కు తెలియకుండానే ఆ ఇంటి పన్నును పంచాయతీ కార్యదర్శి మరొకరి పేరుతో మార్చేశాడు. దీన్ని ఆసరాగా చేసుకుని దొంగ పత్రాలు సృష్టించి ఆయనకు తెలియకుండా సబ్ రిజిస్ట్రార్ వేరొకరి పేరుతో ఇంటిని రిజిస్ట్రేషన్ చేశాడు. ఈ మేరకు ఆ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ భార్య కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి న్యాయం చేయాలని వేడుకున్నా ఫలితం లేదు. కలెక్టరేట్ అధికారులు సంబంధిత అధికారికి ఆ అర్జీని ఫార్వార్డ్ చేస్తే.. సమస్య పరిష్కారం అయినట్లు చూపారు. కానీ.. ఆ సమస్య వాస్తవానికి అలాగే ఉంది.

➡ సీతారామపురంలో ఓ వ్యక్తికి చెందిన పట్టా పొలం ఆయన ఆధీనంలోనే ఉంది. పైరు కూడా పండించుకుంటున్నాడు. అయితే రెవెన్యూ అడంగల్‌లో అధికారులు పేరు మార్చేశారు. ఇలా ఎందుకు మారిందో.. ఎవరు మార్చారో తెలపాలని ఆ రైతు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ సంవత్సరాలు తిరిగినా ఫలితం దక్కలేదు. దీంతో కలెక్టరేట్ చుట్టూ న్యాయం చేయాలని తిరుగుతూ అర్జీలు ఇస్తున్నా పరిష్కారం కావడం లేదు.

అప్పుడిలా.. ఇప్పుడిలా..

గ్రీవెన్స్‌డే.. స్పందన నుంచి.. ప్రజాసమస్యల పరిష్కార వేదికగా మారింది. వేదిక పేరు మార్చిన కూటమి ప్రభుత్వం నిబంధనలు కూడా మార్చేసింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 'స్పందన' పేరుతో నడిచిన ఈ వేదిక అత్యంత పారదర్శకంగా కొనసాగింది. గతంలో కలెక్టరేట్‌లో అర్జీని ఇస్తే.. ఆ సమస్య పరిష్కారం కోసం మండల అధికారులకు పంపిస్తే.. ఆ సమస్యను పరిష్కరించి, సదరు అర్జీదారుడి స్పందన వీడియోను రికార్డు చేసి అప్‌లోడ్ చేసే వాళ్లు. ఒక వేళ ఆ సమస్య పరిష్కరించలేనిదైతే.. అందుకు గల కారణాలను నమోదు చేసే విధంగా జవాబుదారీతనంగా ఉండేది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వ కార్యాలయాల్లో అధికార పార్టీ నేతలు పెత్తనం పెరిగింది. ఆయా సమస్యలను తాము చెబితేనే చేయాలని అధికారులపై ఒత్తిడి పెరిగింది. మరో వైపు నేతల స్వార్థపూరిత చర్యల ఫలితంగా ఏర్పడిన సమస్యలే కారణం కావడంతో అర్జీలకు పరిష్కారం దొరకడం లేదు. కలెక్టరేట్ నుంచి మండల కార్యాలయాలకు పంపించిన అర్జీలకు సంబంధించి జవాబుదారీతనం లేకపోవడంతో తిరస్కరించి, పరిష్కరించామని చెబుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పరిష్కరించినట్లు కాకి లెక్కలు

కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చాక.. గత నెల 25వ తేదీ నాటికి 46,904 అర్జీలు పీజీఆర్ఎస్‌లో ప్రజలు అందజేశారు. ఈ నెలతో కలుపుకుంటే సుమారు 50 వేల వరకు అర్జీలు అధికారులకు అందాయి. వీటిలో 40,509 అర్జీలు పరిష్కరించినట్లు చూపారు. 1,057 అర్జీలను రీఓపెన్ చేసినట్లు చూపారు. కేవలం 285 అర్జీలు మాత్రమే పెండింగ్‌లో ఉన్నట్లు పేర్కొన్నారు. మిగతా అర్జీలు ఏమైనట్లో అర్థం కావడం లేదు. ఎక్కువగా రెవెన్యూ, హౌసింగ్, పోలీసు, డీఆర్‌డీఏ, విద్యుత్ శాఖల్లో ఎక్కువగా సమస్యలున్నాయి. నూతనంగా బాధ్యతలు చేపట్టిన జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు దృష్టికి పీజీఆర్ఎస్ సమస్యలు, నిషేధిత భూములు, రీసర్వే లోపాలను 'సాక్షి' తీసుకెళ్లగా కలెక్టర్‌తో మాట్లాడి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

పీజీఆర్ఎస్ ఫెయిల్యూర్



ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) అట్టర్ ఫ్లాప్. అధికారులు పేరుకే సమస్యలు పరిష్కరించినట్లు చూపుతున్నారు. క్షేత్రస్థాయిలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉంటున్నాయి. రెవెన్యూలో మాయాజాలం నడుస్తోంది. మా బంధువులకు చెందిన పట్టా భూమిని ఆయనకు తెలియకుండానే నోషనల్ ఖాతాలో చేర్చారు. తొలగించాలని కలెక్టరేట్ చుట్టూ కూడా తిరుగుతున్నా ఫైల్ ముందుకు కదలడం లేదు.

– జీవీ ప్రసాద్, స్టూడెంట్ జేఏసీ నాయకుడు

శ్రీవారి దర్శనానికి 5 గంటలు

తిరుమల: తిరుమలలో సోమవారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో ఒక కంపార్టుమెంట్‌లో మాత్రమే భక్తులు వేచి ఉన్నారు. ఆదివారం అర్ధరాత్రి వరకు 67,408 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. 16,597 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.73 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ దర్శన టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలో దర్శనం లభిస్తోంది. దర్శన టికెట్లు లేని వారికి 5 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన వారు 3 గంటల్లో స్వామిని దర్శించుకోగలుగుతున్నారు. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి మాత్రమే క్యూలోకి వెళ్లాలని, కేటాయించిన సమయాని కంటే ముందు వెళ్లిన వారిని క్యూలోకి అనుమతించరని టీటీడీ స్పష్టం చేసింది.

సైబర్ మోసగాళ్ల వలలో విద్యుత్ లైన్ ఇన్‌స్పెక్టర్

- ఏసీబీ డీఎస్పీ పేరుతో రూ.2 లక్షలు కాజేసిన వైనం



బాధితుడు రామ్మూర్తి

వింజమూరు (ఉదయగిరి): వింజమూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఏపీఎస్పీడీసీఎల్ విద్యుత్ లైన్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న రామ్మూర్తి సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన ఘటన ఆలస్యంగా సోమవారం వెలుగులోకి వచ్చింది. బాధితుడు తెలిపిన సమాచారం మేరకు.. బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన డి.రామ్మూర్తి ఏడాది నుంచి వింజమూరులో లైన్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో గత నెల 28న రామ్మూర్తికి సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసి ఏసీబీ కార్యాలయం నుంచి ఫోన్ చేస్తున్నట్లు తెలిపారు. మీరు విద్యుత్ పనుల్లో అవినీతికి పాల్పడినట్లు మా వద్ద ఆధారాలు ఉన్నాయని, అవి బయటకు రాకుండా ఉండాలంటే డబ్బులివ్వాలంటూ డిమాండ్ చేశారు. అయితే రామ్మూర్తి తన వద్ద ఏమీ లేవని ఫోన్ కట్ చేశాడు. దీంతో వింజమూరు విద్యుత్ ఏఈ నాగూర్‌వలికి సైబర్ నేరగాళ్లు ఏసీబీ డీఎస్పీ పేరుతో ఫోన్ చేసి రామ్మూర్తికి కాన్ఫరెన్స్ కాల్ కనెక్ట్ చేయించారు. ఈ క్రమంలో ఏఈ రామ్మూర్తికి వారు చెప్పినట్లు చేయమని ఆదేశించాడు. దీంతో వెంటనే తన భార్య మెడలో ఉన్న బంగారం తాకట్టు పెట్టి ఆమె ఖాతా నుంచి రూ.లక్ష, రామ్మూర్తి ఖాతా నుంచి మరో రూ.98 వేలు వారు తెలిపిన ఖాతాలకు ఫోన్ పే ద్వారా పంపారు. తర్వాత ఈ విషయం స్నేహితులకు చెప్పడంతో ఇది సైబర్ మోసంగా గుర్తించారు. వెంటనే అదే రోజు నెల్లూరులో సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఈ ఘటన జరిగిన నాలుగు రోజులకు కావలి ఏఈకి ఫోన్ చేసి అక్కడ పనిచేస్తున్న లైన్ ఇన్‌స్పెక్టర్ ఫోన్ నంబరు అడిగారు. వింజమూరు ఘటన వారికి తెలియడంతో అప్రమత్తమైనట్లు తెలుస్తోంది. రామ్మూర్తి రూ.24 లక్షలు బ్యాంకులో అప్పు తెచ్చి గతంలో కావలి జరిగిన మనీ స్కీమ్ మోసపోవడం గమనార్హం.

చంద్రబాబు పాలన రైతులకు శాపం

- రైతాంగానికి అండగా ఉండాలనే ఆలోచనే చేయడు
- పండించిన పంటలకు గిట్టుబాటు ధరల్లేవు
- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



ధాన్యం రాసులను పరిశీలిస్తున్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం: చంద్రబాబు ఎప్పుడు అధికారంలో ఉన్నా.. రైతులకు శాపంగా పరిణమిస్తోందని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. రైతాంగానికి అండగా ఉండాలనే ఆలోచన కూటమి ప్రభుత్వానికి, చంద్రబాబుకు ఏమాత్రం లేదన్నారు. మండలంలోని తాటిపర్తి పాళెంలో కృష్ణపట్నం పోర్టు రోడ్డుపై పోసిన ధాన్యం రాసులను సోమవారం కాకాణి పరిశీలించారు. పంట కోతకు వచ్చిన దశలో వర్షాల కారణంగా రైతులు పడుతున్న ఇబ్బందులు, గిట్టుబాటు ధర గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కాకాణి విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబుకు రాష్ట్రాన్ని దోచుకోవాలనే ఆలోచన తప్ప, రైతులను పట్టించుకునే ఆలోచన లేదని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో యూరియా కొరత తీర్చలేక చంద్రబాబు యూరియా ఎక్కువగా వాడితే కేన్సర్ వస్తుందని, ఒకసారి, అవసరానికి మించి అధికంగా యూరియాను సరఫరా చేశామని మరోసారి చెప్పడం రెండు నాల్కుల ధోరణికి నిదర్శనమన్నారు. రాష్ట్రంలో 50 శాతానికి పైగా యూరియాను ప్రైవేట్ డీలర్లకు ఇచ్చారని ఆరోపించారు. కష్టపడి పండించిన పంట వర్షానికి తడవడం, మద్దతు ధర లేకపోవడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారన్నారు. ధాన్యానికి కనీస మద్దతు ధర రూ.20,187 కల్పించాల్సి ఉంటే, ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో రైతులు రూ.13 వేలకు అమ్ముకోవాల్సి వస్తుందన్నారు. వరికోతలన్నీ పూర్తయ్యే సమయంలో చంద్రబాబు రైతులకు సంబంధించి కీలక ప్రకటన చేస్తానని ప్రకటించడం సిగ్గు చేటన్నారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు ఏడుస్తుంటే, సోమిరెడ్డి ఇరిగేషన్ పనులకు సంబంధించి బిల్లులు వెంటనే రిలీజ్ చేయాలని అసెంబ్లీలో మాట్లాడం అతని దిగజారుడు తనానికి నిదర్శనమన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో తాను వ్యవసాయశాఖ మంత్రిగా రైతులు పండించిన ప్రతి పంటకు ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించి రైతులు నష్టపోకుండా చేశామని గుర్తు చేశారు. వైస్ ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య, మండల కన్వీనర్ కొణిదెన మోహన్‌నాయుడు, ఎంపీటీసీలు వేమారెడ్డి రఘునందన్‌రెడ్డి, శివకుమార్ రెడ్డి, నేతలు ఆరుగుంట ప్రభాకర్‌రెడ్డి, కొణిదెన విజయభాస్కర్‌నాయుడు, గుమ్మా మోహన్ తదితరులు పాల్గొన్నారు.

తమ్ముళ్ల మధ్య 'కమీషన్ల' చిచ్చు

- మాలేపాటిపై దగదర్తి టీడీపీ నేత పమిడి కలెక్టర్‌కు ఫిర్యాదు
- డీఆర్ చానల్ అవినీతిపై సీఎంకు ఫిర్యాదు చేసిన మాలేపాటి
- విజిలెన్స్ విచారణకు ఆదేశించిన సీఎం

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: కావలి నియోజకవర్గంలో కమీషన్ల కోసం తెలుగు తమ్ముళ్లు వీధిన పడ్డారు. దగదర్తి పరిధిలో జరుగుతున్న డీఆర్ చానల్ ఆధునీకీకరణ ఆ పార్టీలోనే రెండు వర్గాల మధ్య ఆజ్యం పోసింది. ఈ పనుల్లో భారీ స్థాయిలో అవినీతి జరిగిందంటూ ఏపీ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడు ఇటీవల సీఎం చంద్రబాబును కలిసి ఫిర్యాదు చేయడం, దీనిపై విజిలెన్స్ విచారణకు ఆదేశించడం తెలిసిందే. అయితే మాలేపాటి సదరు పనుల్లో కమీషన్లు ఇవ్వలేదని అడ్డుకుంటున్నాడంటూ సోమవారం కావలి ఎమ్మెల్యే దగుమాటి ముఖ్య అనుచరుడు, దగదర్తికి చెందిన పమిడి రవికుమార్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం అధికార పార్టీలో కలకలం రేపింది.

దగుమాటి వర్సెస్ మాలేపాటి

సార్వత్రిక ఎన్నికల అనంతరం ఎమ్మెల్యే దగుమాటి, మాలేపాటికి మధ్య వైరంతో దూరం పెరిగింది. కావలి అసెంబ్లీ ఆశావహ అభ్యర్థిగా, టీడీపీలో కీలకంగా ఉన్న ఎమ్మెల్సీ బీద రవిచంద్ర ముఖ్య అనుచరుడిగా మాలేపాటి నియోజకవర్గంలో పార్టీని భుజస్కంధాలపై వేసుకుని పనిచేసిన విషయం తెలిసిందే. చివరి క్షణంలో ఆ అవకాశాన్ని దగుమాటి కృష్ణారెడ్డి గద్దలా తన్నుకుపోవడం, ఈ ఎన్నికల్లో ఆయన గెలవడం, పార్టీ అధికారంలోకి రావడంతో ఖిన్నుడైన మాలేపాటి తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తూ బరస్ట్ అయ్యారు. దీంతో మాలేపాటిని ఎమ్మెల్యే కృష్ణారెడ్డి టార్గెట్ చేసి దూరంగా ఉంచారు. ఏకంగా కేసులు కూడా పెట్టించి, నియోజకవర్గంలో అధికార వర్గాల్లో అతని మాట చెల్లుబాటు లేకుండా చేశారు. ఈ నేపథ్యంలో దగుమాటి వ్యవహార శైలిపై ఎమ్మెల్సీ బీద రవిచంద్రకు కూడా నియోజకవర్గంలో ఇబ్బందిగా మారింది. ఎన్నికలకు ముందు పార్టీని మోసిన మాలేపాటిని కాదని దగుమాటికి టికెట్ ఇప్పించి తప్పు చేశామన్నట్లుగా బీద తన అనుచరుల వద్ద వాపోయినట్లు తెలుస్తోంది.

డీఆర్ చానల్ పనుల్లో అవినీతి నిజమేనా?

దగదర్తి–రాచర్లపాడు చానల్ ఆధునికీకరణ పనులకు గత ప్రభుత్వ హయాంలో రూ.27.90 కోట్లు మంజూరయ్యాయి. ఆ పనిని నెల్లూరుకు చెందిన కాంట్రాక్టర్ దక్కించుకుని సబ్ కాంట్రాక్టర్‌కు పని అప్పగించారు. కొంత భాగం పనులు కూడా పూర్తయ్యాయి. కూటమి ప్రభుత్వం రాకతో ఆ పనుల డిజైన్ మార్చేసి నిధులు పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపణలున్నాయి. కాలువ లైనింగ్, పూడిక తీతతో పాటు, రెండు చోట్ల సైఫాన్ల నిర్మాణం చేయాలని ఎస్టిమేషన్, వర్క్ ఆర్డర్‌లో స్పష్టంగా ఉంది. అయితే స్థానిక టీడీపీ నేతలు ఎమ్మెల్యే అండతో ఆ రెండు చోట్ల సైఫాన్ల నిర్మాణాన్ని తొలగించి పనులు చేపడుతున్నారంటూ, దీని వల్ల వరద నీరు వెళ్లే పరిస్థితి లేదని, దగదర్తి రైతులకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని మాలేపాటి ఇటీవల సీఎం చంద్రబాబుకు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు విజిలెన్స్ విచారణకు ఆదేశించడంతో ఎమ్మెల్యే దగుమాటి రగిలిపోయారు. తన అనుచరులతో మాలేపాటి కమీషన్ల కోసమే కాలువ ఆధునికీకరణ పనులు అడ్డుకుంటున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేయించారు. మాలేపాటితోపాటు ఆయన సోదరుడు కమీషన్ల కోసం కాంట్రాక్టర్‌ను బెదిరిస్తున్నారని ఆ ఫిర్యాదులో పేర్కొనడం విశేషం. కమీషన్ల కోసమే ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకోవడంపై అధికార పార్టీ నేతలే విస్తుపోతుంటే.. జిల్లా అధికారులు మాత్రం తలలు పట్టుకుంటున్నారు.

క్లుప్తంగా

మా ఇష్టం.. ఎప్పుడైనా వస్తాం



సోమవారం ఉదయం కలెక్టరేట్‌లో అడ్మినిస్ట్రేటివ్ విభాగంలో ఇలా..

నెల్లూరు రూరల్: కలెక్టరేట్‌లోని పలు సెక్షన్ల ఉద్యోగులు సమయపాలన పాటించడం లేదు. ఉదయం 10:30 గంటలైనా ఒకరిద్దరు కనిపిస్తారంతే. సాయంత్రం మాత్రం గంట కొట్టగానే వెళ్లిపోతున్నారు. మమ్మల్ని అడిగేదెవరులే అన్నట్టుగా నచ్చిన సమయంలో వస్తున్నట్లు ఆరోపణలున్నాయి. కొత్తగా వచ్చిన కలెక్టర్ హిమాన్షు శుక్లా దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డుపై కుప్పకూలి..

- వృద్ధుడి మృతి

నెల్లూరు(క్రైమ్): ఓ వృద్ధుడు రోడ్డుపై కుప్పకూలి మృతిచెందిన ఘటన నెల్లూరులోని సుబేదార్‌పేటలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. పి.నరసింహ (74) తన సమీప బంధువైన సాత్‌రాజుపాళేనికి చెందిన రాహేలు ఇంట్లో ఉంటూ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన కొంతకాలంగా మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నాడు. సోమవారం నరసింహ అదే గ్రామానికి చెందిన వృద్ధురాలితో కలిసి సామగ్రి కొనుగోలు చేసేందుకు సుబేదార్‌పేటకు వచ్చాడు. ఈక్రమంలో ఆయన రోడ్డుపై కుప్పకూలి మృతిచెందాడు. స్థానికుల సమాచారంతో సంతపేట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. రాహేలు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



దేవమణి మృతదేహం

కావలి(అల్లూరు): అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కావలి మండలం ముసునూరు గ్రామం బ్రహ్మంగారి గుడి వీధిలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. కొల్లిబోయిన దేవమణి (32) స్టిక్కరింగ్ పని చేస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం ఇద్దరు స్నేహితులతో కలిసి తుమ్మలపెంట బీచ్ వద్ద పూటుగా మద్యం తాగాడు. తిరిగి బైక్‌పై వస్తుండగా పడిపోయాడు. స్నేహితులు దేవమణిని ఇంటికి తీసుకెళ్లారు. సోమవారం తెల్లవారుజామున అతడికి ఫిట్స్ రావడంతో కుటుంబ సభ్యులు వెంటనే కావలి ప్రభుత్వాస్పత్రికి తరలించగా డాక్టర్ పరీక్షించి అప్పటికే చనిపోయినట్లు నిర్ధారించారు. కావలి రూరల్ ఎస్సై తిరుమలరెడ్డి కేసు నమోదు చేశారు.

కరుణించు తల్లీ..

జిల్లాలో శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మణ్ణి ఆలయాలు కిటకిటలాడాయి. అమ్మవారు ప్రత్యేకాలంకరణలో దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేశారు.


\- సాక్షి నెట్‌వర్క్



చండీ అలంకరణలో రాజరాజేశ్వరి అమ్మవారు



కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో..



ఇరుకళల పరమేశ్వరి ఆలయంలో..



రాపూరు : పెంచలకోనలో సౌభాగ్యలక్ష్మిగా ఆదిలక్ష్మి అమ్మవారు

అర్జీలిచ్చి.. మొర పెట్టుకుని..

- కలెక్టరేట్‌లో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'
- 524 వినతుల అందజేత

నెల్లూరు రూరల్: 'మా వినతులు పరిశీలించి న్యాయం చేయండి' అంటూ ప్రజలు అధికారులను కోరారు. సోమవారం నెల్లూరు కలెక్టర్ కార్యాలయంలోని తిక్కన ప్రాంగణంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. కలెక్టర్ హిమాన్షు శుక్లా, జేసీ ఎం.వెంకటేశ్వర్లు, డీఆర్వో విజయకుమార్, జెడ్పీ సీఈఓ మోహన్‌రావు, జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అత్యధికంగా రెవెన్యూ శాఖవి 180, పోలీస్ శాఖవి 120, పంచాయతీరాజ్ శాఖవి 46, నగరపాలక సంస్థవి 46, ఇతర శాఖలు కలిపి మొత్తం 524 వినతులందాయి.

- తొలుత కలెక్టర్ అర్జీదారులకు సంబంధించి చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ గురించి ఆరాతీశారు.
- ఐటీడీఏ తరఫున తోపుడు బండ్లు అందించాలని ఎం.రంగయ్య, సీహెచ్ ఉష, సతీష్ చంద్ర తదితరులు కోరారు.
- ఐటీడీఏ పీఓ మల్లికార్జునరెడ్డి తమను హేళనగా మాట్లాడుతున్నారని, విచారించి తగిన చర్యలు తీసుకోవాలని పటేల్ నగర్ యానాది మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు శివయ్య, జిల్లా అధ్యక్షుడు మురళి విన్నవించారు.
- దసరా సెలవుల్లోనూ కొన్ని కార్పొరేట్ స్కూల్స్ విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నాయని కలెక్టర్‌కు పీడీఎస్‌యూ నేతలు వినతిపత్రం అందజేశారు. షేక్ షారుక్, కె.ఆశిర్, ఎస్‌కే అన్వర్ మస్తాన్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఇతర అధికారులు

రాకపోకలు ఆపేశారు



మాట్లాడుతున్న గ్రామస్తులు

శెట్టిపల్లి సురేష్ అనే వ్యక్తి మా పొలాలకు దారి ఇవ్వకుండా జేసీబీతో తవ్వించేశాడని కలువాయి మండలం వెంకటరెడ్డి పల్లి గ్రామస్తులు వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ పంటలు కోతకు వచ్చాయన్నారు. రాకపోకలకు వీలు లేకుండా చేశారని, న్యాయం చేయాలని కోరారు.

మమ్మల్ని రిలీవ్ చేయండి



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులు

తమను పాఠశాలల నుంచి రిలీవ్ చేయాలని పలువురు ఉపాధ్యాయులు వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ బదిలీ అయినా ఉపాధ్యాయులు లేకపోవడంతో అదే పాఠశాలలో కొనసాగుతున్నామన్నారు. తక్షణం రిలీవ్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

కన్నీటి గాథలు చెప్పి.. సాయం కోరి..

- అర్జీలు స్వీకరించిన ఎస్పీ అజిత వేజెండ్ల
- అండగా ఉంటానని భరోసా
- చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు

నెల్లూరు(క్రైమ్): 'ఉద్యోగం పేరిట మోసగించారు. పెళ్లి చేసుకుంటానని వంచించాడు. సన్నిహితంగా ఉన్న ఫొటోలను సోషల్ మీడియాలో పోస్టు చేస్తామని బెదిరిస్తున్నాడు. ఉద్యోగాలిప్పిస్తానని మోసగించారు. ఇలా ఒక్కొక్కరిది ఒక్కో కన్నీటి గాథ. మోసగాళ్లపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని పోలీసు ఉన్నతాధికారులను కోరారు. నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. జిల్లా నలుమూలల నుంచి 122 మంది వచ్చి తమ సమస్యలను వినతుల రూపంలో ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్లకు అందజేశారు. వాటిని పరిశీలించిన ఆమె అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. చట్టపరిధిలో సమస్యలను పరిష్కరించి బాధితులకు సత్వర న్యాయం చేయాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో నెల్లూరు రూరల్, కావలి డీఎస్పీలు జి.శ్రీనివాసరావు, పి.శ్రీధర్, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులురెడ్డి, మహిళా పోలీసు ఇన్‌స్పెక్టర్ టీవీ సుబ్బారావు, ఎస్‌బీ – 2 ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వినతుల్లో కొన్ని..

- నా ఆస్తిని పిల్లలకు పంచేశాను. నా జీవనోపాధి నిమిత్తం రూ.3 లక్షల నగదును దాచిపెట్టుకున్నాను. పెద్ద కుమార్తె ప్రమీల, ఆమె భర్త బలవంతంగా ఆ నగదును తీసుకున్నారు. నాకు వచ్చే వృద్ధాప్య పింఛన్‌ను సైతం లాక్కొంటున్నారు. నాకు పూటగడవడమే కష్టంగా ఉంది. విచారించి న్యాయం చేయాలని వెంకటాచలం మండలానికి చెందిన ఓ వ్యక్తి కోరాడు.



సమస్యలు వింటున్న ఎస్పీ అజిత వేజెండ్ల

- బుచ్చికి చెందిన కాలేషా నాతో సన్నిహితంగా ఉండేవాడు. చెప్పినట్ల వినకపోతే వ్యక్తిగత వీడియోలు, ఫొటోలు సోషల్ మీడియాలో పోస్టు చేస్తానని బెదిరిస్తున్నాడని ఓ మహిళ ఫిర్యాదు చేశారు.
- వింజమూరుకు చెందిన హరేంద్ర నన్ను ప్రేమిస్తున్నాని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసగించాడు. విచారించి న్యాయం చేయాలని ఉదయగిరికి చెందిన ఓ యువతి విజ్ఞప్తి చేశారు.
- నా కుమారుడు ఎంబీబీఎస్ పూర్తి చేశాడు. హైదరాబాద్‌కు చెందిన అమీర్మియా, రేష్మ దంపతులు అతడికి హైదరాబాద్‌లోని ఎయిమ్స్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి రూ.13.60 లక్షలు నగదు తీసుకున్నారు. ఉద్యోగం ఇప్పించలేదు. నగదు తిరిగివ్వడంలేదు. ప్రశ్నిస్తే చంపుతామని బెదిరిస్తున్నారని నవాబుపేటకు చెందిన ఓ మహిళ ఫిర్యాదు చేశారు.
- చిత్తూరుకు చెందిన మంజునాథ సాఫ్ట్‌వేర్ కంపెనీ సీఈఓనని నమ్మించాడు. తన కంపెనీలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి రూ.26.68 లక్షల తీసుకుని మోసగించాడు. అతడిపై చర్యలు తీసుకోవాలని దగదర్తికి చెందిన ఓ యువకుడు కోరారు.
- భర్త, అత్తింటివారు అదనపుకట్నం కోసం వేధిస్తున్నారు. ప్రతి విషయానికి గొడవ పెట్టుకుని ఇబ్బంది పెడుతున్నారు. కౌన్సెలింగ్ నిర్వహించి కాపురాన్ని చక్కదిద్దాలని వేదాయపాళేనికి చెందిన ఓ మహిళ అర్జీ ఇచ్చారు.

కన్నబిడ్డే తరిమేశాడయ్యా..

- కలెక్టర్‌కు కన్నీరు తెప్పించిన రమాజ్యోతి
- ఆమె బాధకు చలించిన హిమాన్షు శుక్లా

నెల్లూరు రూరల్: 'అయ్యా.. నేను నడవలేను. ఎప్పుడు ఏమవుతుందో తెలీదు. కాటికి కాళ్లు చాచిన స్థితిలో ఉన్న నన్ను పెద్ద కొడుకు మోసం చేశాడు. బాగా చూసుకుంటానని మభ్యపెట్టి ఉన్న ఇంటిని అతని పేరు మీద రాయించుకున్నాడు. ఇప్పుడు ఇంటి నుంచి తరిమేశాడు. నిలువ నీడ లేకుండా పోయింది. కూడు, గుడ్డ, గూడు కోసం ఇబ్బంది పడుతున్నాను. నాకు న్యాయం చేయండి' అని కావలి పట్టణానికి చెందిన రమాజ్యోతి అనే వృద్ధురాలు కలెక్టర్ హిమాన్షు శుక్లాకు తన బాధను తెలిపి బోరున విలపించింది. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి జ్యోతి మరో మహిళను తోడుగా తీసుకుని వచ్చింది. లోనికెళ్లి అర్జీ ఇచ్చేందుకు నేలమీదే కూర్చొని వేచి చూడసాగింది. హిమాన్షు శుక్లా ప్రజా సమస్యల పరిష్కార వేదికకు తొలిసారిగా వస్తూ రమాజ్యోతిని చూశారు. ఆమె వద్దకెళ్లి కష్టం గురించి అడిగి తెలుసుకున్నారు. కుమారుడు ఎం.శ్రీనివాస్ నన్ను మభ్యపెట్టి రాయించుకున్న ఇంటి రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసి కాస్తంతా నీడ కల్పించాలని కలెక్టర్‌కు చెప్పుకొని ఏడ్చింది. ఆయన కన్నీటి పర్యంతమయ్యారు. చలించిపోయి అధికారులను పిలిచి ఆమెకు సత్వరమే న్యాయం చేయాలని ఆదేశించారు.



సమస్య తెలుసుకుంటున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.40
సన్నవి : రూ.25
పండ్లు : రూ.15



నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్	:రూ.128
లేయర్	:రూ.110
బ్రాయిలర్ చికెన్	:రూ.230
స్కిన్‌లెస్ చికెన్	:రూ.256
లేయర్ చికెన్	:రూ.187



రాష్ట్రపతి అవార్డుకు ఎంపిక



మాట్లాడుతున్న వీసీ శ్రీనివాసరావు

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ వలంటీర్ ఎం.పృథ్వీరాజ్ రాష్ట్రపతి అవార్డుకు ఎంపికయ్యాడు. మండలంలోని కాకుటూరు వద్దనున్న వర్సిటీలో సోమవారం వీసీ అల్లం శ్రీనివాసరావు విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ సమష్టి కృషి కారణంగా వీఎస్‌యూ అభివృద్ధి చెందుతోందన్నారు. ఎన్ఎస్ఎస్ కార్యక్రమాల్లో పృథ్వీరాజ్ ప్రతిభ చూపాడని, ఈనెల 29 తేదీన ఢిల్లీలో రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకుంటారని తెలియజేశారు. 2020 – 21 విద్యా సంవత్సరంలో చుక్కల పార్థసారథి, 2021 – 22లో సాత్విక, 2022 – 23 సంవత్సరానికి పృథ్వీరాజ్ ఎంపికవడం గొప్ప విషయమన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, ప్రిన్సిపల్ సీహెచ్ విజయ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ లీకై అగ్నిప్రమాదం



మంటలు ఆర్పుతున్న సిబ్బంది

నెల్లూరు(క్రైమ్): వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు గ్యాస్ లీకై అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించి మంటల్ని ఆర్పారు. వివరాలు.. పొగతోటలోని అలీస్ స్పెషాలిటీ ఆస్పత్రి నాలుగో అంతస్తులో సిబ్బంది ఉంటున్నారు. సోమవారం అక్కడ వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు గ్యాస్ లీకై అగ్నిప్రమాదం జరిగింది. సిబ్బంది అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందజేశారు. డీఎఫ్ఓ వాకా శ్రీనివాసులురెడ్డి ఆదేశాల మేరకు లీడింగ్ ఫైర్‌మెన్ సీహెచ్ నారాయణ తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే ఆ ప్రాంతమంతా మంటలు వ్యాపించి దట్టమైన పొగ అలుముంది. అతికష్టంపై మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.లక్ష మేర ఆస్తి నష్టం సంభవించిందని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

- కలెక్టరేట్ ఎదుట విద్యుత్ ఉద్యోగుల నిరసన



నెల్లూరు రూరల్: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల కార్మికుల ఉమ్మడి కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ కాంట్రాక్ట్ లేబర్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు గత ప్రభుత్వంలో అనుసరించిన విధంగా నేరుగా యాజమాన్యం వేతనాలు చెల్లించాలన్నారు. 2019లో నియమించబడిన ఎనర్జీ అసిస్టెంట్లను రెగ్యులర్ చేసి జేఎల్ఎంలుగా పరిగణించి వేతనాలు తదితర ప్రయోజనాలు కల్పించాలని కోరారు. ఇంజినీరింగ్ డిగ్రీ కలిగిన జూనియర్ ఇంజినీర్లకు ఏఈఈలుగా పదోన్నతి కల్పించాలని కోరారు. అన్ని విభాగాల్లో ఖాళీలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అధికారులకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ ఎస్.కృష్ణయ్య, కన్వీనర్ ఎన్వీ రాఘవరెడ్డి, ఉద్యోగులు పాల్గొన్నారు.

పురిటిబిడ్డకు పోస్టుమార్టం వద్దంటూ..

- సీహెచ్‌సీ ఎదుట ఆందోళన



ఉదయగిరి: పురిటిబిడ్డకు పోస్టుమార్టం చేయొద్దంటూ ఉదయగిరి సామాజిక ఆరోగ్యం కేంద్రం వద్ద సోమవారం ఆందోళన జరిగింది. సీతారామపురం మండలం బసినేనిపల్లికి చెందిన మంజుల ప్రసవ సమయంలో పురిటిబిడ్డ మృతిచెందిన విషయం తెలిసిందే. నెల్లూరు నుంచి వచ్చిన వైద్యులు నవజాత శిశువుకు పోస్టుమార్టం నిర్వహించేందుకు ప్రయత్నించగా ఆ కుటుంబ సభ్యులు, బంధువులు అడ్డుకున్నారు. దీంతో సీహెచ్‌సీలో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. పోస్టుమార్టం నిర్వహించేందుకు వీల్లేదని, బిడ్డను ఇవ్వాలని ఆందోళన చేపట్టడంతో పోలీసులు రంగప్రవేశం చేశారు. ఇరువర్గాల మధ్య కొంతసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. సీఐ ఎస్.వెంకట్రావు, ఎస్సై ఇంద్రసేనారెడ్డి వారికి నచ్చజెప్పి పోస్టుమార్టం నిర్వహించి పురిటిబిడ్డను అప్పగించారు. ఈ వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న డాక్టర్ రవీంద్రనాథ్ ఠాగూర్‌పై సోమవారం స్థానికంగా ఎలాంటి విచారణ జరగకపోవడంతో బాధితులు ఉన్నతాధికారుల తీరుపై మండిపడ్డారు. నిర్లక్ష్యంగా వైద్యం చేసిన వైద్యుడిపై చర్యలు తీసుకోకపోతే మళ్లీ ఆందోళన చేస్తామని చెప్పారు.